శరవేగంగా కారిడార్ పనులు..!

-మరో రెండు నెలల్లో పూర్తి - స్కైవాక్ ఒక వైపు తొలగింపు

ఉప్పల్, జూన్ 29 ప్రభాతవార్త : ఉప్పల్‌లో చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2018లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని నిర్ణయించారు. పనులు నత్త నడకన సాగడంతో పలుమార్లు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. దసరా నాటికి పూర్తి చేయాలని అప్పట్లో ఆయన ఆదేశించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కారిడార్ పనులు ఆలస్యం అయ్యాయి. భూసేకరణ, కోర్టు కేసులు, ఇతర సమస్యల కారణంగా గత ఎనిమిది సంవత్సరాలుగా పనులు కొనసాగుతున్నాయి. సుమారు 6.2 కిలో మీటర్ల పరిధిలో ఉప్పల్ నుంచి నారపల్లి వరకు సుమారు రూ.625 కోట్ల అంచనా వ్యయంతో ఆర్‌అండ్‌బి అధికారులు పనులు చేపట్టారు. 45 మీటర్ల వెడల్పుతో కూడిన ఆరు లైన్ల రహదారి నిర్మించేందుకు నిర్ణయించారు. నారపల్లి నుంచి ఉప్పల్ వరకు మొదట విడత ఆర్ అండ్‌బి అధికారులు నిర్మాణం చేపట్టారు. అక్కడి నుంచి డిఎస్ఎల్ మార్ల్ వరకు సుమారు మరో రూ.350 కోట్లతో ఎంఎంసి అధికారులు కారిడార్ పనులు చేపడుతున్నారు. ఉప్పల్ రింగ్‌రోడ్‌లో వరంగల్ జాతీయ రహదారి మూసి వేసి ప్రస్తుతం చౌరస్తాలో పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. గత నెల రోజులుగా సాగుతున్న పిల్లర్ల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందితో స్థానికులు అవస్థలు పడుతున్నారు.

ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ పనులు చేపడుతున్న దృశ్యం.

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం చేపట్టిన పిల్లర్ నిర్మాణం దృశ్యం.

స్కైవాక్ కొంత భాగం తొలగింపు : ఉప్పల్ స్కైవాక్ వరంగల్ వైపు ఉన్న దారిలో కొంత భాగం తొలగించనున్నారు. స్కైవాక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా రెండు వైపులా దారి నిర్మించి పిల్లర్ నిర్మాణం చేపడుతున్నారు. స్కైవాక్ మూడు వైపులా యధావిధిగా రాకపోకలు సాగుతాయని అధికారులు తెలిపారు. ఒక్క వైపు మాత్రమే కొద్ది రోజులు స్కైవాక్ మూసివేస్తామని, ఫిల్లర్ నిర్మాణం పూర్తి చేసిన వెంటనే తిరిగి పునరుద్దరిస్తామని హెచ్ ఎండిఏ అధికారులు తెలిపారు. కాగా ఉప్పల్ చౌరస్తాలో కారిడార్ నిర్మాణం మరో రెండు నెలల్లోగాపూర్తి చస్తామని ఎంఎంసి అధికారులు పేర్కొంటున్నారు. పనులు వేగంగా సాగుతున్నాయని, నిత్యం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పనులు పర్యవేక్షిస్తున్నారని వారు తెలిపారు.

హైదరాబాద్ వార్త

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు ఏవీ?

-మీటర్ మోసాలతో ముంచుతున్న నిర్వాహకులు
-తూతూమంత్రంగా తూనికలు కొలతల శాఖ దాడులు
-సిబ్బంది ముందుగానే సమాచారాన్ని అందిస్తున్నట్లు అనుమానాలు
-మామూళ్ల మత్తులో జోగుతున్న పలువురు అసిస్టెంట్ కంట్రోలర్లు

హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త: వాహనాలు పెరిగాయి..పెట్రో ఉత్పత్తుల వాడకమూ పెరిగింది. ప్రస్తుతం ధనిక పేద అనే తేడా లేకుండా పెట్రోల్, డీజిల్, ప్రతి ఒక్కరికీ నిత్యావసరాలుగా మారాయి.ప్రతి ఒక్కరూ ఏదోఒక వాహనం వినియోగిస్తూనే ఉన్నారు. వాటితో పాటు రవాణాకోసం నగర వ్యాప్తంగా అనేక రకాల వాహనాలు తిరుగతాయి. దీంతో ఇంధన వినియోగం రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతుంది. ఈక్రమంలో వినియోగదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు పెట్రోల్ బంక్ డీలర్లు, బంకుల యజమానులు అక్రమాలకు పాల్పడుతూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. తూనికలు కొలతల అధికారుల లెక్కల ప్రకారం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో 500లకు పైగా పెట్రోల్ బంకులు ఉంటే అందులో హైదరాబాద్‌లో 178కాగా, రంగారెడ్డి పరిధిలో దాదాపు 330వరకు ఉంటాయి. వీటిలో చాలావరకు బంకుల్లో ట్యాంపరింగ్ చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నాయి. అలాగే హైదరాబాద్ పరిధిలోని పెట్రోల్‌బంకుల్లో అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయి. బంకుల్లో కొలమానాలు లేని పరిస్థితి కనిపిస్తుంది. పెట్రోల్ డీజిల్ పోయించుకునేటప్పుడు వినియోగదారుడికి కల్తీ జరిగినట్లు అనుమానం వచ్చినా, తక్కువ కొట్టినట్లు అనిపించినా చెక్ చేసుకునేందుకు ప్రతి బంకులోనూ నిర్వాహకులు పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనల ప్రకారం ఫిల్టర్ టెస్ట్ పేపర్‌ను ,డెన్సిటీ హైడ్రోమీటర్, 5లీటర్ల కొలమానం ప్రతి బంకులో అందుబాటులో ఉంచాలి. ఏవినియోగదారుడు అడిగినా నిర్వాహకులు తప్పనిసరిగా వీటిని అందజేయాలి. కానీ ఎక్కడా ఆయా పరికరాలు అందుబాటులో ఉండని పరిస్థితి ఉంది. ఒకవేళ ఎవరైనా వినియోగదారుడు తప్పనిసరిగా కావాలని అడిగితే నీకు ఇష్టమైతే పోయించుకో లేకుంటే లేదు అంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని వాపోతున్నారు. అరునెల క్రితం రంగారెడ్డి జిల్లా పరిధిలో 8పెట్రోల బంకుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు 5లీటర్ల పెట్రోల్‌కు 25ఎంఎల్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అదే రోజు హైదరాబాద్ పరిధిలోని 10పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి కేసు నమోదు కాలేదు. దీంతో పలువురు వినియోగదారులు కేసులు నమోదు కాకపోడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల నిర్వాహకుల సమాచారాన్ని ముందుగా చేరవేడయం వల్లే ఎలాంటి కేసులు నమోదు కాలేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దాడులకు బయలు దేరేముందు నిర్వాహకులకు సమాచారాన్ని చేరవేయడంగానీ, క్రింది స్థాయి సిబ్బంది ద్వారా కానీ సమాచారం వెల్లడంతో బంక్‌ల నిర్వాహకులు మీటర్లను సెట్ చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా అవసరమున్నపుడే దాడులు నిర్వహించి వారిని నుంచి లంచాలు వసూలు చేసుకుని ఆతర్వాత చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

బంకుల్లో వెళ్లినప్పుడు వినియోగదారులు ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా గమనించాలి. వాహనాల్లో పెట్రోల్ పోయించుకునే ముందు తప్పనిసరిగా ఎన్సార్‌పై జీరో అయిందో లేదో చూసుకోవాలి. పెట్రోల్ యంత్రంపై తూనికలు,కొలతలు శాఖ ముద్రను గమనించాలి. పెట్రోల్‌లో వైట్ పెట్రోల్,నాఫ్తా,కిరోసిన్ కలిపే అవకాశం ఉంది. అనుమానం వస్తే వెంటనే పెట్రోల్ పేపర్‌ను తీసుకుని పరిశీలించాలి. పెట్రోల్,డీజిల్‌పై అనుమానం వస్తే డెన్సిటీ హైడ్రోమీటర్ ఇవ్వకుంటే తప్పని సరిగా ఇవ్వాలని డిమాండ్ చేయాలి. ఎలక్ట్రానిక్ మిషన్‌లో టాంపరింగ్ అయ్యే అవకాశం ఉన్నందున అనుమానం వస్తే తప్పనిసరిగా కొలమానం అడిగి తీసుకొని కొలవాలి.

క్వార్టర్స్‌లో ఉండే పోలీస్ అధికారులని ఖాళీ చేయించాలని డిజిపికి వినతి

-నోటీసులు ఇచ్చిన స్పందన లేదని డిజిపికి వివరించిన ఉపకులపతి అల్దాస్ జానయ్య

అత్తాపూర్ జూన్ 29,ప్రభాతవార్త : గత 45 ఏళ్ల నుంచి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం లోని ఉన్నతాధికారుల క్వార్టర్స్ లో నివసిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులని వెంటనే ఖాళీ చేయించవలసిందిగా ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య డీజీపీ కి విజ్ఞప్తి చేశారు.సోమవారం ఉపకులపతి వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తో కలిసి డీజీపీతో సమావేశం అయ్యారు. విశ్వవిద్యాలయంలో గత 60 ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్ లో విశ్వ విద్యాలయానికి చెందిన చీఫ్ వార్డెన్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్స్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, డైరక్టర్ ఆఫ్ రీసెర్చ్ తదితర ఉన్నతాధికారులు ఆ క్వార్టర్స్ లోనే నివసించి విద్యార్థుల భద్రత,సంక్షేమం,క్రమశిక్షణ అంశాలను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయంలోని కీలక పదవులు కొంతకాలం ఖాళీగా ఉన్నందున ఆనాటి విశ్వవిద్యాలయ యాజమాన్యం పోలీస్ అధికారుల అభ్యర్థన మేరకు క్వార్టర్స్‌ని తాత్కాలికంగా కేటాయించే సమయంలోనే విశ్వవిద్యాలయం ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు ఖాళీ చేస్తామన్న నిబంధనతోనే పోలీస్ అధికారులు క్వార్టర్స్‌లోనికి ప్రవేశించారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతితో పాటు రిజిస్ట్రార్, డీన్స్, డైరక్టర్స్ సహా ఎనిమిది మంది ఉన్నతాధికారులని జనవరి 2025 లోనే నియమించారు.అనంతరం విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల నివాసం కోసం క్వార్టర్స్‌ని ఖాళీ చేయవలసిందిగా విశ్వవిద్యాలయం పోలీస్ ఉన్నతాధికారులని కోరింది. వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో విశ్వవిద్యాలయం వారికి అనేక సార్లు నోటీసులు ఇచ్చింది. ప్రభుత్వం దృష్టికి కూడా విషయాన్ని తీసుకెళ్లారు.ఆగస్టు 2025లో నాటి డీజీపీ క్వార్టర్స్‌ని తక్షణమే ఖాళీ చేసి అన్ని రకాల బకాయిలని విశ్వవిద్యాలయానికి చెల్లించవలసిందిగా నోటీసులు పంపారు. అయినా నేటి వరకూ పోలీస్ అధికారుల నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఈ నెల 16 వ తేదీన వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశంలో ఈ అంశాన్ని ఉప కులపతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదృష్టికి తీసుకొనివెళ్లారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ క్వార్టర్స్ లో ఉంటున్న పోలీస్ అధికారులని తక్షణమే ఖాళీ చేయించవలసిందిగా ముఖ్యమంత్రి తన కార్యాలయాన్ని ఆదేశించారు. అదే విషయాన్ని ఉప కులపతి,రిజిస్ట్రార్ లు నూతనం గా డీజీపీ గా నియమితులైన సి. వి. ఆనంద్‌ని మర్యాద పూర్వకంగా కలసి ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకొని వెళ్లారు. త్వరలోనే పోలీస్ అధికారులుని విశ్వవిద్యాలయం క్వార్టర్స్ నుంచి ఖాళీ చేయిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు.

డిజిపి సివి ఆనంద్‌తో ఉపకులపతి అల్దాస్ జానయ్య,రిజిస్ట్రార్ విద్యాసాగర్

చెత్త పేరుకు పోయిందిలా.. నీరు పోయేదెలా..

-వర్షాకాలంలో నాలా పరివాహక బస్తీలకు పొంచి ఉన్న ముప్పు

కూకట్‌పల్లి నాలా బ్రిడ్జి కింద చెత్తా చెదారంతో మూసుకు పోయిన ఖానాలు.

బేగంపేట జూన్ 29,ప్రభాతవార్త

కూకట్‌పల్లి నాలాలో నీరు పోయే ఖానాలు చెత్తా చెదారంతో మూసుకు పోయాయి.వర్షా కాలం కావడం,వర్షాలు కురుస్తుండటంతో నాలా పరివాహక బస్తీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ప్రతి వేసవి లో నాలాల్లో పూడిక తీసి వర్షాకాలం నాటికి నాలా పరివాహక బస్తీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.అయితే బేగంపేట కూకట్‌పల్లి నాలా బ్రిడ్జి ఖానాలలో చెత్తా చెదారం చిక్కుకు పోయింది.ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో నాలా పరివాహక బస్తీలైన వడ్డెర బస్తీ,బ్రాహ్మణవాడీ, చికోటిగార్డెన్, అల్లంతోటబాయి,ప్రకాష్‌నగర్ ,ప్రకాష్ నగర్ ఎక్స్‌టెన్షన్ లతో పాటు మాతాజీ నగర్ బస్తీల వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కూకట్‌పల్లి ,బాలానగర్,ఫతేనగర్ తదితర ప్రాంతాల్లో వివిధ రకాలైన ఫ్యాక్టరీలు ఉండటం,వర్షాకాలంలో నాలాలో నీటి ఉధృతి ఎప్పుడు పెరుగుతుందోనని పై బస్తీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే నాలాలో పూడిక తీసే వారు.అయితే ఈ సారి పూడిక తొలగించి నాలాలోనే ఆ కుప్పలను వదిలి వేయడం,నీరు ప్రవహించే ఖానాలు చెత్తా చెదారంతో చిక్కుకు పోవడంపై పై బస్తీల వాసులు అవి తొలగించకుంటే తమ బస్తీలకు ముప్పు తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఖానాలకు అడ్డుగా ఉన్న చెత్తా,చెదారాన్ని తొలగింపజేసి నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని పై బస్తీల ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణిలో సత్వరమే సమస్యల పరిష్కారం

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త

ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, ఫిర్యాదులు,వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొని, ప్రజలు వినిపించిన సమస్యలను పరిశీలించి తగిన చర్యలపై చర్చించారు. ప్రజావాణి కార్యక్రమంలో 21 వినతిపత్రాలు అందగా, వాటిని సంబంధిత విభాగాలకు పంపించి తక్షణ పరిష్కారం కోసం కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని, సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు. విభాగాల వారీగా అందిన వినతులలో ఇంజినీరింగ్ విభాగంలో నాలుగు, టౌన్ ప్లానింగ్ విభాగంలో 13, యూసిడి విభాగంలో ఒకటి, హౌసింగ్ విభాగం, రెవెన్యూ, ఎలక్షన్ విభాగాల్లో ఒకటి చొప్పున మొత్తం 21 ఫిర్యాదులు అందినట్లు అధికారులు ప్రకటించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగవంతమైన స్పందన, సమర్థవంతమైన సేవలందించేందుకు ఎంఎంసి నిరంతరం కృషి చేస్తోందని కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ కదిరవన్ పలని

హైదరాబాద్,జూన్ 29 ,ప్రభాతవార్త: ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందచేసిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మరో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి నారాయణ లతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందచేసిన దరఖాస్తులను అధికారులు శాఖల వారీగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అలాగే సి.ఎం ప్రజావాణి, కలెక్టరేట్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి సత్వరమే పరిష్కరించుటకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి లో మొత్తం దరఖాస్తులు 1064 అందాయని అందులో హౌసింగ్ 2బిహెచ్‌కే శాఖకు సంబంధించి 927అర్జీలు, పింఛన్లు 101, రెవిన్యూ శాఖ 18, అలాగే ఇతర శాఖలకు సంబంధించి 18 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ అక్కేశ్వరరావు , జిల్లా సంక్షేమ అధికారులు జి.ఆశన్న,కోటాజి, ఇలియాస్ అహ్మద్, డీఈవో యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కదివరన్ పలని

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి ప్రాజెక్టుల రూపకల్పన

-జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త

జలమండలి పరిధి క్యూర్ వరకు విస్తరిస్తున్న భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్ట్యా చేపడుతున్న ప్రాజెక్టులను సమగ్ర దృష్టితో ప్రణాళికాబద్ధంగా నిర్మాణం చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం గోదావరి ఫేజ్-2, 3 ప్రాజెక్టులు, నియోపోలీస్ సమగ్ర మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. ముందుగా ఖానాపూర్‌లో నిర్మాణంలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనుల పురోగతిని సమీక్షించి, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నియోపోలీస్ సమగ్ర మంచినీటి సరఫరా కోసం ప్రతిపాదించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పంపింగ్ స్టేషన్, డబ్ల్యూటీపీ నిర్మాణ పనులను ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోపోలీస్ ప్రాంతంలో నిర్మిస్తున్న రెండు 2.5 మిలియన్ లీటర్ల సామర్థం గల రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా గ్రావిటీ పద్ధతిలో ఏయే ప్రాంతాలకు నీటి సరఫరా చేయవచ్చో సమీక్షించారు. భూమి విలువ అధికంగా ఉన్న నేపథ్యంలో, భవిష్యత్ విస్తరణను దృష్టిలో ఉంచుకుని రిజర్వాయర్లను బహుళ అంతస్తుల నిర్మాణ నమూనాలో రూపొందించే అవకాశాలను సాంకేతికంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రస్తుతం అవసరమైన నిర్మాణ ప్రొవిజన్ మాత్రమే కల్పించి, భవిష్యత్ విస్తరణను ప్రత్యేక టెండర్ల ద్వారా చేపట్టే విధానంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని సూచించారు. అలాగే ప్రధాన పైప్‌లైన్‌ల అనుసంధానం, గ్రావిటీ ఆధారిత నీటి ప్రవాహం, రోడ్డు పనులకు అంతరాయం కలగకుండా ముందస్తు పైప్‌లైన్ ప్రొవిజన్లు, కనీసం ఒక రోజు అవసరానికి సరిపడే రన్నింగ్ స్టోరేజ్ ఏర్పాటు వంటి అంశాలపై సమగ్ర సాంకేతిక అధ్యయనం నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అవాంతరాల పరిస్థితుల్లో కూడా నగర తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ అంశాలపై కన్సల్టింగ్ ద్వారా సాంకేతిక సాధ్యాసాధ్యాల అధ్యయనం నిర్వహించి, భవిష్యత్ విస్తరణ, అదనపు నిల్వ సామర్థం, వ్యయ ప్రయోజనాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అంతకుముందు హెచ్ఎండీఏ అధికారులతో కలిసి ఖానాపూర్ సమీపంలో 1200 ఎంఎం డయా తాగునీటి పైప్‌లైన్ షిఫ్టింగ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, సీజీఎం రాజశేఖర్, జనరల్ మేనేజర్లు, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ఫేజ్-2,3 నియోపోలీస్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

రోడ్లపై ఎస్టీపీ శుద్ధి చేసిన నీటి విడుదలపై కొరడా...

ప్రధాన రహదారులపై ప్రైవేట్ ఎస్టీపీలలో శుద్ధి చేసిన నీటిని అనుమతి లేకుండా విడుదల చేస్తున్న వారిపై జలమండలి కఠిన చర్యలు చేపట్టింది. ఈ నెల 26న నిర్వహించిన తనిఖీలలో జూబ్లీహిల్స్ రోడ్ నెం.82లోని ఓ వాణిజ్య సంస్థ ఎస్టీపీ శుద్ధి చేసిన నీటిని ప్రజా రహదారిపై విడుదల చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో నీరు నిల్వ ఉండి ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగడంతో పాటు అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై సంబంధిత యాజమాన్యానికి చట్టబద్ధ నోటీసు జారీ చేసి, వెంటనే నీటి విడుదల నిలిపివేయాలని, శుద్ధి చేసిన నీటిని నిబంధనల ప్రకారం పునర్వినియోగం చేయాలని ఆదేశించారు. అలాగే 48 గంటల్లోగా అమలు నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రజా అసౌకర్యానికి కారణమైనందుకు సంబంధిత సంస్థపై రూ.1 లక్ష జరిమానా విధించారు. మూడు రోజుల్లోగా చెల్లించని పక్షంలో అదనపు జరిమానాలు, తాగునీరు.. మురుగునీటి సేవల నిలిపివేతతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జలమండలి హెచ్చరించింది.

మాల్స్, లాడ్జిలకు నోటీసులు ..మహిళల భద్రతకు పోలీసుల ప్రత్యేక డ్రైవ్

హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త : హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలో ఉన్న వందకుపైగా షాపింగ్ మాల్స్, లాడ్జిలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. మాల్స్ లాడ్జిల్లో హిడెన్ కెమెరాల నివారణకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. షాపింగ్ మాల్స్, లాడ్జిల్లో.. హిడెన్ కెమెరాలు, స్పై కెమెరాలు ఏర్పాటు చేసి.. అక్కడికి వచ్చే కస్టమర్ల ప్రైవేటు వీడియోలను తీసి.. వాటిని సోషల్ మీడియాలో, పోర్న్ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసే కొంతమంది దుర్మార్గుల వ్యవహారం ఇప్పటివరకు చాలాసార్లు బయటపడ్డాయి. ఇలాంటి ఘటనలతో మహిళలు.. మాల్స్‌లోని ట్రయల్ రూమ్, లాడ్జిల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో మహిళల భద్రత, వారికి భరోసాను కల్పించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ట్రయల్ రూమ్స్, రెస్ట్ రూమ్స్‌లో మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రతీ మాల్‌లో కస్టమర్ సేఫ్టీ ఇన్‌ఛార్జ్‌ను నియమించాలని, హిడెన్ కెమెరాలను గుర్తించే డిటెక్షన్ డివైస్‌లను ఉపయోగించాలని సూచించారు. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి రికార్డులను మెయింటెయిన్ చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద డివైజ్‌లు కనిపిస్తే వెంటనే తమకు చెప్పాలని షాపింగ్ మాల్స్, లాడ్జిల యజమానులకు కీలక ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలోనే హిడెన్ కెమెరాలను గుర్తించేందుకు డిటెక్షన్ డివైస్‌లను కూడా ఉపయోగించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ.. రికార్డులను పక్కాగా మెయింటైన్ చేయాలని పోలీసులు లాడ్జి, మాల్స్ యాజమాన్యాలకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాల్స్, లాడ్జిల్లో ఏవైనా అనుమానాస్పద డివైజ్‌లు కనిపిస్తే తక్షణమే తమకు చెప్పాలని కస్టమర్లకు పోలీసులు సూచించారు.మహిళల భద్రత, ఇతర విషయాల్లో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వార్నింగ్ ఇచ్చారు.

సికింద్రాబాద్‌లోని మిలిటరీ కాలేజీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ సెంటర్‌లో జరిగిన 109వ కన్వికేషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే

త్యాగరాయ గానసభలో నయనానందకరంగా నాట్య రంజని

చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, జూన్ 29: (ప్రభాతవార్త) : చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై శ్రీ రామ జయ రామ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నాట్యరంజని శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. వివిధ వాగ్గేయకారుల కీర్తనలకు అనుగుణంగా ఎస్ఆర్ఎస్ డాన్స్ అకాడమీకి చెందిన జ్యోతిర్మయి శిష్యబృందం ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. గాయనులు శిరీష, వాణి, ధనలక్ష్మి తదితరులు ఆలపించిన కీర్తనలు సభికులను అలరించాయి. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు కుడికల మల్లేశ్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన బాల, యువ నృత్య-సంగీత కళాకారులను ప్రోత్సహించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సహ వ్యవస్థాపకులు శివపార్వతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పిల్లలకు కళలలో శిక్షణ ఇవ్వడం ద్వారా సంస్కారం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. కళలను పరిరకించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వినయ్ కుమార్, కళాభిమాని రామమోహనరావు, పలువురు కళాకారులు, తల్లిదండ్రులు, ప్రేక్షకులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం కళారసికులను అలరించింది.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించటమే లక్ష్యం

బీఎస్టీ కాలనీలో చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు అందజేస్తున్న ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్‌లిమిటెడ్ సీఈవో జీడీ మనోజ్ పాసంగా.

యూసుఫ్‌గూడ, 29 జూన్, ప్రభాతవార్త

వినియోగదారులకు తమ వంతుగా నాణ్యమైన సేవలు అందించేందుకు ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ సిబ్బంది అన్ని విదాల కృషి చేయటం జరుగుతుందని ఆ సంస్థ సీఈవో జీడీ మనోజ్ పాసంగా అన్నారు. సోమవారం మోతీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది కష్టపడి సంపాదించుకున్న బంగారాన్ని తమపై నమ్మకంతో ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ కంపెనీలో దాచుకుంటారని వారికి అందించే గోల్డ్ లోన్ సంతృప్తికరంగా ఉండేలా తాము తమ బాధ్యతగా అందివ్వడం జరుగుతుందన్నారు. దీనితో పాటు ఆన్‌లైన్ యాప్ ద్వారా గోల్డ్ లోన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. తమ సంస్థ తరపున పలు సేవా కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, బుక్కులను పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ హెడ్ ముత్తు భాస్కర్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, నరసింహా, ఏరియా మేనేజర్ అనీష్ బుజ్జి, బ్రాంచ్ హెడ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జానపద కళాప్రదర్శనలతో దద్దరిల్లిన తెలంగాణ ప్రజాకళ

రవీంద్రభారతి, జూన్ 29 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 99 రోజులపాటు నిర్విరామంగా జరుగుతున్న సాంస్కృతిక మహోత్సవం తెలంగాణ ప్రజాకళ 89వ రోజు జరిగిన వివిధ జానపద కళాప్రదర్శనలతో దద్దరిల్లింది. ముందుగా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన పద్మ బృందం తెలంగాణ మట్టివాసనను, పల్లెజీవనాన్ని ప్రతిబింబించే కళాకారులు ఆడిపాడిన జానపద పల్లెపాటలు పట్టణ ప్రేక్షకులను మైమరపించాయి. ఇక మెదక్ జిల్లాకు చెందిన రౌంజా వాయిద్య గంభీర ధ్వనుల అర్జున్ కళాకారుల బృందం కనీవినీ ఎరుగనిరీతిలో ఒకపక్క వీరత్వానికి, మరోపక్క భక్తికి ప్రతీకగా నిలిచే రౌంజా వాయిద్యంతో ఆహుతులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా జరిగిన తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవ సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు పి.నర్సింలు, డా. పి.విజయ్‌కుమార్, ముచ్చర్ల దినకర్ తదితరులతో కలిసి కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలి : నర్సింగ్‌రావు



గాంధీనగర్ తో సమగ్ర ఓటర్ల జాబితా ప్రక్రియను పరిశీలిస్తున్న సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మారిశెట్టి నర్సింగ్‌రావు

చిక్కడపల్లి జూన్ 29 (ప్రభాతవార్త) : ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం గాంధీనగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్లు 14, 15, 16లలో జరుగుతున్న ఓటర్ల ధృవీకరణ ప్రక్రియను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మారిశెట్టి నర్సింగ్‌రావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ధృవీకరణ ప్రక్రియలో పారదర్శకత పాటించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని కోరారు. ప్రజలు కూడా తమ వివరాలను పరిశీలించి అవసరమైన పత్రాలను సమర్పించి సహకరించాలని సూచించారు. గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి సాయి కీర్త్ (బాబ్జీ), కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

బేగంపేట్ విమానాశ్రయంలోకి అక్రమ ప్రవేశం.. ఒకరి అరెస్ట్

జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త:

బేగంపేట్ విమానాశ్రయంలో అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకొని పంజాగుట్ట పోలీ సులకు అప్పగించారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 27న ఉదయం 10.10 గంటలకు రసూల్‌పుర వైపు నుంచి ఓ వ్యక్తి విమానాశ్రయ ప్రహరీ గోడ ఎక్కి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నిం చాడు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఎల్. గణేష్ ఈ విషయాన్ని గమనిం చి వెంటనే అధికారులకు సమాచారం అందించారు. దీంతో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎ.వి. రమణ, కానిస్టేబుల్ ఎ. రాజు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రామచందర్‌గా గుర్తించారు. అనంతరం అతడిని పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశ ఆర్థిక శ్రేయస్సును అందించేది చార్టర్డ్ అకౌంటెంట్లే

-ట్యాక్స్ బార్ అసోసియేషన్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు చంద్రశేఖర్ వేముల

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు చంద్రశేఖర్ వేముల

హైదరాబాద్ జూన్ 29 ప్రభాతవార్త

ఆర్థిక శ్రేయస్సును అందిస్తూ చార్టర్డ్ అకౌంటెంట్లు భారతదేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ,ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీఏ చంద్రశేఖర్ వేముల తెలిపారు. ఆర్థిక రికార్డులను ఆడిట్ చేయడం, నియంత్రణల అనుగుణ్యతకు హామీ ఇవ్వడం, వ్యూహాత్మక పన్ను, వ్యాపార సలహా సేవలను అందించడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని, పారదర్శకతను పాటించాలని కోరారు. సోమవారం సికింద్రాబాద్‌లో తెలుగు రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఏ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2026న పూర్తిగా అమల్లోకి వచ్చిన నూతన ఆదాయపు పన్ను చట్టం, 2025పై చార్టర్డ్ అకౌంటెంట్లు తప్పనిసరిగా పట్టు సాధించాలన్నారు. క్లయింట్‌లకు వేగవంతమైన సేవలను అందించడం కోసం, ప్రాక్టీషనర్లు ఆదాయపు పన్ను శాఖ యొక్క కొత్త డిజిటల్ ప్రచార వేదికలైన 'కర్ సాథీ' మరియు 'కర్ సేతు' ఉపయోగించుకోవాలని కోరారు. ట్యాక్స్ బార్ అసోసియేషన్‌ను బలోపేతం చేయడానికి నిరంతర విద్య, పన్ను అధికారులతో వ్యూహాత్మక వాదోపవాదాలు మరియు డిజిటల్ పరివర్తనపై దృష్టి సారించాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్ను చెల్లింపులు పెరిగేలా కృషి చేస్తూ దేశ ఆర్థికాభివృద్ధిలో తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు హితేష్ జైన్, కళ్యాణ్ దాస్, వేణుగోపాల చారీ, జెవి రావు, డి. బాలాజీ, యు.ఎల్.వి. సుధాకర్, హేమేంద్ర షా, కృష్ణ మూర్తి, ఈశ్వరన్, బొజ్జ మధుసూదన్, శాంతి శ్రీ, ప్రస్తుత కార్యదర్శి సీఏ ఆశిష్ జోషి, కోశాధికారి సోమేశ్వర్ నెమ్మాని, సలహాదారు సీఏ రామ్‌దేవ్ బుటాడా, కంపిటేషన్ కమిటీ చైర్మన్ సీఏ అమృత్ కుమార్ కోటా, ఉపాధ్యక్షులు సీఏ పి.వి. నారాయణరావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు సీఏ ప్రవల్లిక వేముల, సిఏ ప్రకాష్ చోకదా, సీఏ వెంకట్ రామ్, సీఏ శైలేంద్ర శర్మ, సిఏలీల కృష్ణ మోహన్, ఎన్.వి. చారి, అజయ్ వాల్వే, ఏపీ దహిమా తదితరులు పాల్గొన్నారు

పాఠశాల అదనపు గదులను ప్రారంభించుకోవడం అభినందనీయం : పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ

ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 29, ప్రభాతవార్త

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర నగర్ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్, చెన్నై షాపింగ్ మాల్ వారి సిఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన 4 అదనపు తరగతి గదుల భవనంను ఎంఈఓ రవీందర్ రాజు, ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పిఏసి చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ చెన్నై షాపింగ్ మాల్ వారి సిఎస్ఆర్ నిధులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన 4 అదనపు తరగతి గదులను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. పాఠశాలకు పండుగ రోజని, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారి బంగారు భవిష్యత్తుకు పునాది లాంటిది ప్రాథమిక విద్య అని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియచేశారు. పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజంకు మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని చెప్పారు. మియాపూర్ 10 ఎకరాలలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియన్ పాఠశాలకు ఇటీవలే శంకుస్థాపన చేశారని, త్వరలోనే పనులు ప్రారంభించుకోవడం జరుగుతుందని, కొండాపూర్ చందానగర్‌లో కోర్ అర్బన్ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలను అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో ప్రవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని గాంధీ తెలియచేశారు.ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు అశోక్ అగర్వాల్, అనిరుద్ సోమ్ పల్లి, లోకేశ్వర్ రెడ్డి, అభిషేక్ అగర్వాల్, విదిష అగర్వాల్, దీపా శర్మ, శిశం సబర్వాల్, రీటా అగర్వాల్, తేజస్విని రెడ్డి, చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రతినిధులు శంకర్, సంజయ్, హెడ్ మాస్టర్ ఆంజనేయులు నాయకులు సంజీవ రెడ్డి, హరినాథ్, చంద్రమోహన్ సాగర్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, వెంకట స్వామి సాగర్, వెంకట్, రాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జెక్ కాలనీ నూతన కార్యవర్గాన్ని సన్మానించిన డాక్టర్ కోట నీలిమ

నీలిమను సన్మానించిన వెల్ఫేర్ సభ్యులు

సంజీవరెడ్డి నగర్, జూన్ 29, ప్రభాతవార్త:

సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని జెక్ కాలనీలో నూతనంగా ఎన్నికైన జెక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమను ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షి ంచారు.ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా పనిచేస్తూ కాలనీలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కాలనీవాసుల అవసరాలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీ అభివృద్ధి రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు.నూతనంగా ఎన్నికైన ఫెడరేషన్ సభ్యులు కాలనీవాసుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకంగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు కంజర్ల సదాశివ యాదవ్, సీవీ సుబ్బారావు, సునీల్ కుమార్, శారద, సుదర్శన్, సురేష్, లక్ష్మణ్, సోమ వెంకట్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు ప్రతిరూపంగా పత్రికలు ,ప్రసార మాధ్యమాలు ఉండాలి : అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

అమర్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి, రామమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి తదితర అతిథులు

నాంపల్లి, జూన్ 29 ప్రభాతవార్త : ప్రజలకు, పాఠకులకు విశ్వసనీయతకు ప్రతిరూపంగా పత్రికలు, ప్రసార మాధ్యమాలు ఉండాలని, దాన్ని కాపాడుకొనే దిశగా ముందుకు పయనించాలని తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో సోమవారం రాత్రి పరిషత్తు ఆధ్వర్యంలో నిరంతరంగా కొనసాగుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పరిణతవాణి ప్రసంగ కార్యక్రమానికి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం అభ్యుదయం, విప్లవం, వామపక్ష భావజాలం అంటేనే వ్యతిరేకత కనిపిస్తుంది కానీ సామాజిక చింతన, అభ్యుదయ భావాలు కలిగినవారు పత్రికల్లో పనిచేసే వారిలో ఎక్కువమంది ఉండేవారని శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల సమస్యల సాధనలో వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఎంతో కృషిచేసిందని, అందులో దేవులపల్లి అమర్ భాగస్వామ్యం ఉందని తెలిపారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో పరిణతవాణిలో ప్రసంగించే పెద్దల అనుభవాలు సద్దిమూటలా ఎంతో ఉపయుక్తమన్నారు. ప్రముఖ పాత్రికేయుడు దేవులపల్లి అమర్ తన అనుభవాలతో పరిణతవాణి ప్రసంగం కావిస్తూ 50ఏళ్లక్రితం పత్రికారంగంలో ప్రవేశించి పలు ప్రముఖ పత్రికల్లో పనిచేశానని, అదే సమయంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ వేదికగా రాజీలేని ఎన్నో పోరాటాలు సాగించానని తెలిపారు. పత్రికల్లో పనిచేస్తూనే అనేక అంశాలపై టీవీ చానళ్లలో, ఇతర వేదికల్లో రాజకీయ విశ్లేషణలు సాగించానని పేర్కొన్నారు. ప్రెస్ అకాడమీ అధ్యక్షుడుగా సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోను, మీడియా వ్యవహారాల సలహాదారుగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సేవలందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్తు వేదికగా రాడికల్ విద్యార్థి సంఘం, విప్లవ రచయితల సంఘం కార్యక్రమాల్లో పాల్గొన్న విషయాన్ని నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాషావేత్త డా. డి.చంద్రశేఖర్‌రెడ్డి, సమన్వయకర్తగా రింగురామమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథుల చేతులమీదుగా దేవులపల్లి అమర్‌ను ఘనంగా సత్కరించారు.

తెలంగాణలో ఆర్‌పీఐ(ఏ) బలోపేతమే లక్ష్యం : శివ నాగేశ్వరరావుగౌడ్

రాందాస్ అథవాలేను మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ నేతలు

ముషీరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త: తెలంగాణలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) పార్టీని బలోపేతం చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆపార్టీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి పేరం శివనాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి సతీష్ కుమార్‌లు స్పష్టం చేశారు. సోమవారం వారు ఆర్‌పీఐ (ఏ) జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌కుమార్‌ను రాందాస్ అథవాలే అభినందించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఆగస్ట్ 18న హైదరాబాద్‌లో ఖైరతాబాద్‌లోని కొండా విశ్వేశ్వర భవన్‌లో భారీ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై రాందాస్ అథవాలే ఆ సభలో దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, యువజన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఈ సభకు హాజరవుతారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యాచరణ, సంస్థాగత నిర్మాణం, సామాజిక న్యాయం తదితర అంశాలపై రాందాస్ అథవాలే కీలక సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పిఎస్ఆర్‌కె భగవాన్

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 29, ప్రభాతవార్త

కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా పిఎస్ఆర్‌కె భగవాన్ నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా కే సురేష్ కుమార్, ఏ రఘునాథ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా ఏ రామశేషగిరిరావు, కోశాధికారిగా టి మల్లేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఏ వీరేశప్ప, జి నాంచారయ్య, కార్యవర్గ సభ్యులుగా శ్రీకృష్ణమోహన్, భువన ప్రసాద్, జీవి సాగర్, కె ఎన్ ఎం శ్రీనివాస్, ఎం దాసిరెడ్డి, జయ జ్యోతిర్మయి, సుబ్బారెడ్డి, డాక్టర్ సూర్య ప్రకాష్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పిఎస్ఆర్‌కె భగవాన్ మాట్లాడుతూ వడ్డేపల్లి ఇంట్లో ఓనర్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా తనకు మరో అవకాశం కల్పించినందుకు సంక్షేమ సంఘం అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. అలాగే కాలనీవాసులకు కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కబ్జాదారుల గుప్పిట్లో 50కోట్ల బల్దియా భూమి

-ఆక్రమణలపై స్పందించపోతే న్యాయపోరాటం చేస్తాం: మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి

బల్దియాభూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన నవతారెడ్డి

శేరిలింగంపల్లి, జూన్29 ప్రభాతవార్త

మహిళా భవనం కోసం కేటాయించిన 50కోట్ల విలువైన బల్దియా భూమి ఆక్రమణలకు గురవుతున్నా సీయంసీ అధికారులు మొద్దునిద్ర వీడటంలేదు.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే, ప్రజాప్రతినిధుల అండదండలతో కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చందానగర్ డివిజన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ భూ భాగోతం మునిసిఫల్ అధికారుల నిర్లక్ష్యానికి, అధికార దుర్వినియోగానికి అద్దం పడుతోంది. సొంత భూమిని రక్షించుకోవడంలో విఫలమైన అధికారుల తీరుపై చందానగర్ మాజీ కార్పొరేటర్, న్యాయవాది బొబ్బ నవతారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు మునిసిఫల్ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటి కమిషనర్లకు గత రెండేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయమై సోమవారం సీఎంజీ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌కు నవతారెడ్డి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చందానగర్ డివిజన్ కైలాస్‌నగర్ కాలనీలోని సర్వేనంబర్ 210లో సుమారు 4వేల గజాల స్థలం ఉంది. దీని బహిరంగ మార్కెట్ విలువ దాదాపు 50 కోట్ల రూపాయల విలువ ఉంటుంది. ఈ స్థలంలో మహిళా భవనం, మోడల్ మార్కెట్, ఫంక్షన్‌హాల్ నిర్మించేందుకు రంగారెడ్డిజిలా కలెక్టర్ 2018 మార్చి 7న 2019 మే5న, ప్రొసిడింగ్స్ ఎల్‌సి/3076/2016 ద్వారా మున్సిఫల్ కార్పొరేషన్‌కు కేటాయించారు. దీని ప్రకారం 2019లోనే కార్పొరేషన్ అధికారులు ఆ స్థలానికి ప్రహారీగోడ నిర్మించి,గేటు కూడా ఏర్పాటు చేశారు. కాగా కబ్జాదారులు 2022 అగస్టు 10న, 2024 ఫిబ్రవరి 9న దౌర్జన్యంగా ఆ ప్రహారి గోడను కూల్చేశారు. ఇంత జరుగుతున్నా స్థానిక మునిసిఫల్ అధికారులు చోద్యం చూశారే తప్ప చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి. సదరు భూమి ఆక్రమణలకు గురువుతుండటంపై మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేయగా అధికారులు అత్యంత బాధ్యతారాహిత్యంగా బదులిచ్చారు. సదరు భూమి తమదికాదని, ప్రభుత్వ భూమియని దానికి సంబందించిన వివరాలు తమ వద్దలేవని తప్పుడు సమాచారం అందించారు. దీంతో నవతారెడ్డి స్వయంగా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలను జతచేసి 2024 లో అప్పటి డిప్యూటి కమిషనర్, మునిసిఫల్ కమిషనర్, జోనల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. 2025 నవంబర్‌లో సైతం జోనల్ కమిషనర్‌కు మరోసారి వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ ఉన్నతాధికారుల్లో చలనం లేదు. మునిసిఫల్ అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తు లు అదే స్థలంలో టీజీఎస్పీడీసీఎల్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి తెరతీశారు. దీనిపై నవతారెడ్డి ఆర్టీఐ ద్వారా విద్యుత్ శాఖను వివరణ కరగా, ఆ భూమికి సంబందించి తమ వద్ద ఏలాంటి అధికారిక కేటాయింపు పత్రాలు లేవని, ప్రజాప్రతినిధుల సూచనలతో నిర్మాణం చేశామని సమాదాన మిచ్చారు. ఇదే విషయమై మునిసిఫల్ టౌన్‌ప్లానింగ్ అదికారులను నిలదీ యగా తాము విద్యుత్ శాఖకు హెచ్‌ఎంసీ యాక్ట్ యు/ఎస్635 కింద నోటీసులు ఇచ్చామని చేతులు దులుపుకు న్నారు. కోట్లాది రూపాయల విలువైన భూమిని ఆక్రమించి ఏలాంటి అనుమతులు లేకుండా స్థలం పత్రాలు లేకుండా నిర్మానాలు జరుగుతుంటే నోటీసులు ఇచ్చి వదలివేయటంపై బొబ్బ నవతారెడ్డి విరుచుకుపడ్డారు. రూ.50కోట్ల ప్రజాధనాన్ని కబ్జాదారులకు దారదత్తం చేస్తూ అదికారులు చోద్యం చూడ టంపై ఆమె మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ ప్రకారం తక్షణమే సదరు భూమిని స్వాధీనం చేసుకుని మహిళా భవనం,ఫంక్షన్‌హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉన్న తాధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి తక్షణమే ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మునిసిఫల్ అధికారుల తీరును ఎండగడుతూ పెద్దఎత్తున మహిళా పోరాటం, న్యాయపోరాటం చేస్తామని బొబ్బ నవతారెడ్డి హెచ్చరించారు.

కల్తీ నివారణ అవగాహనకు లయన్స్ ఎక్సలెంట్ అవార్డు

యూసుఫ్‌గూడ, 29 జూన్, ప్రభాతవార్త

ప్లాస్టిక్ నిషేధం, కల్తీ ఆహారంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా జిల్లా 320డి ఎక్సలెంట్ అవార్డులను అందివ్వడం జరిగింది. మోతీనగర్‌లో జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ దిల్‌సే అవార్డు, 2025, 26లో పర్యావరణ పరిరక్షణ రంగంలో చేసిన సేవలను గుర్తింపునకుగాను లయన్ కోటిరెడ్డికి లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ అధ్యక్షుడు అమర్‌పాల్ సింగ్ అప్రియేషన్ సర్టిఫికెట్ అందజేయగా డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ అమర్‌నాథ్‌రావు ఎక్సలెంట్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా లయన్ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పర్యావరణ పరిరక్షణ కల్తీ నివారణ కెమికల్స్‌తో తయారు చేసే ప్లాస్టిక్ నిషేధం కోసం తాను చేసిన సేవలను గుర్తించి తనకు ఈ అవార్డు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అందుకుగాను అవార్డు అందజేసిన లయన్స్ అమర్‌నాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకం

నాంపల్లి నియోజకవర్గంలో (సర్)కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్‌ఆనంద్‌కుమార్‌గౌడ్,పరిశీలకులు అబ్దులా సోహెల్

గన్‌ఫౌండ్రి, జూన్ 29 ప్రభాతవార్త:

రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ(సర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం నాంపల్లి డివిజన్‌లో జరుగుతున్న (సర్)ను నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్,బిఆర్ఎస్ పరిశీలకులు అబ్దులా సోహెల్‌లు పరిశీలించారు.పరిశీలించారు.ఈ సందర్భంగా 47వ పోలింగ్ బూత్ అధికారులు చేపడుతున్న ఓటర్‌జాబితా సవరణ కార్యక్రమం,బూత్ లెవల్ అధికారుల(బిఎల్‌వోలు)ద్వారా ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్‌ఫారాలు పంపిణి,ఓటర్ల వివరాల సేకరణ తదితర అంశాలను నాయకులు పరిశీలించారు.వారు మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా,సమగ్ర సవరణ,ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల న్నారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శివ,మహేష్, మురళి, ఇక్బాల్,అలీ,జమాల్‌ఖాన్,లతీఫ్,బిఎల్ఉ షంషేర్ పాల్గొన్నారు.

లంగర్ హౌస్‌లో క్షేత్రస్థాయి ఓటరు ధ్రువీకరణ ప్రక్రియ

లంగర్ హౌస్ లో ఇంటింటికి తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ ప్రక్రియ చేపడుతున్న బిఎల్‌ఓలు.

మెహదీపట్నం, జూన్ 29, ప్రభాతవార్త : లంగర్ హౌస్ డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ బూత్ లలో బిఎల్‌ఓలు ఇంటింటికి తిరుగుతూ క్షేత్రస్థాయి ఓటరు ధృవీకరణ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ సందేహాలను నివృత్తి చేశారు. అర్హత కలిగిన ఓటరు వివరాలను సరైన విధంగా నమోదు అయ్యేలా బిఎల్‌ఓలకు ఓటర్లు సహకరించాలని కోరారు. ఓటు హక్కు అనేది 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ లంగర్ హౌస్ డివిజన్ అధ్యక్షులు జి సంతోష్ గౌడ్, బిఎల్‌ఓలు ఆకాష్, భూపాల్, హరి, శంకర్, అనిల్ కుమార్‌లు ఉన్నారు.

వరకట్న వేదింపు కేసులో జైలు శిక్ష

అల్వాల్, జూన్ 29 ప్రభాతవార్త: వరకట్న వేదింపు కేసులో ఓ వ్యక్తికి మల్కాజిగిరి జిల్లా ప్రధాన సెషన్స్ న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. అల్వాల్ పోలీసు స్టేషన్‌లో 2020 వరకట్న వేదింపులు కేసు నమోదైంది. ఓల్డ్ అల్వాల్ రిట్రీట్ కాలనీ సాయి శ్రీనివాస్ అపార్ట్‌మెంట్‌లో నివసించే చెరుకు రోహిత్ కుమార్(39) భార్యను అదనపు కట్నం వేదించిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. ఆరు సంవత్సరాలుగా సాగిన విచారణ అనంతరం జిల్లా ప్రధాన సెషన్స్ న్యాయమూర్తి రోహిత్ కుమార్‌కు 1 సంవత్సరం 6 నెలలు సాధారణ కారాగార శిక్షతో పాటుగా 10వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిపై బెదిరింపుల కేసు నమోదు

జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మండభేరి గోపరాజుపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సొసైటీ ఆర్థిక వ్యవహారాలపై ప్రశ్నించినందుకు తనను అసభ్య పదజాలంతో దూషించి, చంపేస్తామని బెదిరించారని కోశాధికారి భీమగాని మహేశ్వర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే డ్రైవర్ గోపాల్‌తో కలిసి పలుమార్లు చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేశారని, గుర్తు తెలియని వ్యక్తులను సొసైటీ కార్యాల యానికి తీసుకువచ్చి భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు అనుమతి అనంతరం జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.14 లక్షల మోసం.. నకిలీ నోట్లతో టోకరా

జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త:

రుణం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు కాజేయడమే కాకుండా నకిలీ నోట్లతో టోకరా వేసేందుకు ప్రయత్నించిన ఒక ప్రబుద్ధుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. వ్యాపారవేత్త నరాలశెట్టి ప్రసన్న కుమార్‌కు తనకు తెలిసిన వ్యక్తుల ద్వారా నరేష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. రుణం ఇప్పిస్తానని నమ్మించి 2024 నుంచి విడతల వారీగా రూ.14 లక్షలు తీసుకున్నాడు. అనంతరం డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి చిల్డ్రన్స్ బ్యాంక్ పేరుతో నకిలీ కరెన్సీ నోట్లను ఇచ్చాడు. గతంలోనూ రూ.10 లక్షల నకిలీ డిమాండ్ డ్రాఫ్ట్ ఇచ్చాడని ప్రసన్నకుమార్ పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు అడిగితే అసభ్య పదజాలంతో దూషిస్తూ, చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నడని అందులో తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 316(2), 318(4), 308(5), 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖైరతాబాద్ పోస్టాఫీసులో చోరీయత్నం

జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త: ఖైరతాబాద్ పోస్టాఫీసులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 25న రాత్రి 9 గంటలకు కార్యాలయం మూసివేసి పోస్టాఫీసు సిబ్బంది వెళ్లిపోయారు. మరుసటి రోజు మొహర్రం సెలవు కావడంతో పోస్టాఫీసు తెరవలేదు. 27న స్వీపర్ ఉమ పై అంతస్తును శుభ్రం చేస్తుండగా పీఎల్ఏ విభాగంలోని అల్మారా నేలపై పడిపోయి ఉండటం, అకౌంట్స్ సెక్షన్, స్టాక్ బ్రాంచ్ డ్రాయర్లు తెరిచి ఉండటాన్ని గమనించి సమాచారం ఇచ్చింది. సిబ్బంది కార్యాలయాన్ని పరిశీలించగా నగదు లేదా ఇతర వస్తువులు చోరీకి గురికాలేదని నిర్ధారించుకున్నారు. అనంతరం సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా దుండగులు గోడలోని గాలి వెంటిలేటర్ ద్వారా లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. చోరీకి యత్నించిన గుర్తుతెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోస్టల్ అసిస్టెంట్ అమర్ సింగ్ ఫిర్యాదు చేయగా ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 62వేల చీరెలతో పరారైన పోర్టర్ డ్రైవర్

జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త: ఆన్‌లైన్ లాజిస్టిక్స్ సంస్థ అయిన పోర్టర్ యాప్ ద్వారా బుక్ చేసిన రూ.62 వేల విలువైన చీరలను డెలివరీ చేయకుండా డ్రైవర్ పరారైన ఘటనపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసు కథనం ప్రకారం.. రాహు ల్ అనే డ్రైవర్ ఎప్రిల్ 6న పోర్టర్ యాప్ ద్వారా భాగస్వామిగా చేరాడు. ఈ నెల 14 న ఓ కస్టమర్ రూ.22 వేల విలువైన రెండు చీరలు, జూన్ 15న మరో కస్టమర్ రూ. 40 వేల విలువైన నాలుగు చీరలను రవాణా చేయాలని యాప్‌లో బుకింగ్ చేశారు. నార్సింగి ప్రాంతంలో సరుకును స్వీకరించిన రాహుల్, షేక్ పేట్ లోని గమ్య స్థానానికి వాటిని చేర వేయకుండా మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యాడు. కంపెనీ ప్రతిని ధులు, వినియోగదారులు పలు మార్లు సంప్రదించినా స్పందించలేదు. ఈ ఘటనతో కస్టమర్లకు రూ.62 వేల నష్టం వాటిల్లడమే కాకుండా సంస్థ ప్రతిష్ఠకు కూడా భంగం కలిగిందని సంస్థ ప్రతినిధి బండే మనోహర్ రెడ్డి ఫిర్యాదు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే డ్రైవర్ ఖాతాను యాప్ నుంచి నిలిపివేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE
HON'BLE I ADDL. JUNIOR CIVIL
JUDGE-CUM-XII ADDI. JUDL,
MAGISTRATE OF FIRST CLASS
MEDCHAL-MALKAJGIRI DIST
AT:KUKATPALLY
O.S.P.NO. 38 OF 2026
BETWEEN:
Pericherla Venkata Rama Raju and 2 others ...PETITIONERS
AND
The Tahasildar, Kukatpally Mandal and Others ...RESPONDENTS
To
Whom so it may concern (in Rem)
Please take notice that the petitioners herein filed a petition against the respondents for issuance of Legal heir Certificate in favour of the petitioners of deceased late Pericherla Vani, who expired on 03-10-2025. If anybody is having objections or any claims in the said matter, they should appear before this Hon'ble court on 08-07-2026 at 10.30 AM in person or by pleader, failing which the matter will be decided according to the law.
// By order of the court//
Sd/- K.V. Achuta Rama Rao, Advocate
Plot No.381, Flat No.101, A-Block, Surya Jyothi Apartments, 6th Phase, K.P.H.B. Colony, Hyderabad-500 085.
Mobile No. 9849113892

బోనాల వేడుకలను పార్టీలకు అతీతంగా జరుపుకోవాలి : ఎమ్మెల్యే తలసాని

దక్కన్ మానవ సేవా సమితి ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట,జూన్ 29 ప్రభాతవార్త: మహంకాళి జోనాల జాతరను పార్టీలకు అతీతంగా ఘనంగా జరుపుకోవాలని మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని క్యాంప్ కార్యాలయంలో దక్కన్ మానస సేవా సమితి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. సంస్థ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూలై 19వ తేదీన నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై కావాలని సంస్థ ప్రతినిధులు తలసానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సికింద్రాబాద్ బోనాల సందర్భంగా మహంకాళి అమ్మవారి దర్శనం కోసం లక్షలాది మంది భక్తులకు దక్కన మాన సేవా సమితి అందిస్తున్న సేవలను ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు రఘు,మోహన్,ప్రధాన కార్యదర్శిలు సి.కె.నర్సింగ్‌రావ్, అత్తిలి మల్లికార్జున్ గౌడ్,కమిటీ సభ్యులు కమల్ కుమార్, శ్రీనివాస్, రాజేష్,హరిబాబు యాదవ్‌లు పాల్గొన్నారు.

ప్రతి పౌర్ణమికి అన్నప్రసాద వితరణ : హేమంత్ శర్మ

ఖాకగూడ వీరాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న హేమంత్ శర్మ,చక్రాదర్ రావ్

కంటోన్మెంట్,జూన్ 29 ప్రభాతవార్త: ప్రతి పౌర్ణమికి దత్తాత్రేయ స్వామి అభిషేకం, సత్య నారాయణ స్వామి వ్రతం,గోమాత పూజా నిర్వహిస్తున్నామని 5వ వార్డు ఖాకగూడ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు, బ్రహ్మశ్రీజ్యోతిష్యవాస్తు శస్త్రవేద పండితులు హేమంత్ శర్మ తెలిపారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అనంతరం మాదుకరి బిక్ష అన్నదానం ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాద వితరణ కమిటీ ప్రతినిధి చక్రాదర్, ఖాకగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అలయ కమిటీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి వ్యాయామం ఎంతో మేలు

మేకలబండలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కృష్ణా యాదవ్

చాంద్రాయణగుట్ట, జూన్ 29, ప్రభాతవార్త : ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం వ్యాయామం ఎంతో అవసరమని మాజీ మంత్రి, బిజెపి నేత సి.కృష్ణా యాదవ్ అన్నారు. సోమవారం శాలి బండ డివిజన్ మేకలబండ క్రీడా మైదనంలో సుమారు రూ.17 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణా యాదవ్ మాట్లాడుతూ దాదాపు నలభై సంవత్సరాల క్రీడా మైదానంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించటం సంతోషకరమన్నారు. తద్వారా మెరుగైన క్రీడలు, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఓపెన్ జిమ్‌ను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిజెపి భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పొన్న వెంకట రమణ మాట్లాడుతూ మైదానంలో ఓపెన్ జిమ్, బోరింగ్, ఫెన్సింగ్, గేటు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ముఖేష్, ఉదయ్ కుమార్, ప్రవీణ్ జైన్, బస్తీ పెద్దలు రవి, మశ్చేంద్ర, అర్జున్ యాదవ్, మల్లేష్ యాదవ్, హను మంతరావు తదితరులు పాల్గొన్నారు.

సర్‌ను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు

బేగంపేట జూన్ 29,ప్రభాతవార్త : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్)ను బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి నేతృత్వంలోని బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు.ప్రకాశంనగర్ ఎస్సీ,బీసీ కమ్యూనిటీ హాలులో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని శ్రీహరి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు.బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించడంతో పాటు ప్రతి ఓటర్‌కు ఎన్యుమరేషన్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారికి సూచన చేసారు.ఫారాల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీహరి వెంట రాజయ్య,బంగారి శ్రీను,ఉన్నారు.

శాశ్వత మెగా పిరమిడ్‌కు స్థలం కేటాయించాలి

డిప్యూటీ కలెక్టర్ చంద్రావతికి వినతిపత్రం అందజేస్తున్న కుంచపు రమా

నిజాంపేట్, జూన్ 29, ప్రభాతవార్త : నిజాంపేట్‌లో శాశ్వత మెగా పిరమిడ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మెడిటేషన్ మాస్టర్ కుంచపు రమా సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ప్రజావేదికలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రావతిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కుంచపు రమా మాట్లాడుతూ నిజాంపేట్ ప్రాంత ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా శాశ్వత మెగా పిరమిడ్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో గత కొన్ని రోజులుగా కలెక్టరేట్ అధికారులను కలిసి స్థలం కేటాయించాలని కోరుతున్నామని తెలిపారు. ఈ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, స్థలం కేటాయింపునకు సహకరిస్తామని డిప్యూటీ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.మెగా పిరమిడ్ నిర్మాణం ద్వారా ప్రజలు ధ్యానం చేసుకునేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతుందని, మానసిక ప్రశాంతత, ఒత్తిడి తగ్గింపు వంటి ప్రయోజనాలు కలుగుతాయని తమ విశ్వాసమని కుంచపు రమా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్, ప్రవీణ్ చారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవిలకు దేవస్నానం

- 15 రోజులు జ్వరంతో దర్శన విరామం

చాంద్రాయణగుట్ట, జూన్ 29, ప్రభాతవార్త : పవిత్రమైన దేవస్నాన పౌర్ణమి (స్నాన యాత్ర)ని పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట శ్రీ జగన్నాథస్వామి మఠంలో సోమవారం విశేష పూజలను నిర్వహించారు. శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవి, సుదర్శన చక్రాలను గర్భగుడి నుండి ప్రత్యేక వేదికపైకి తీసుకు వచ్చారు. అర్చక స్వామి సంజయ్ కుమార్ పాండే మంత్రోచ్చారణల మధ్య సుగంధ ద్రవ్యాలు కలిపిన మట్టి కుండలలోని పవిత్ర జలంతో మహాస్నానం చేయించారు. కర్పూర నీరజానాలిచ్చి మహానైవేద్యం సమర్పించారు. స్థానిక భక్తులు దేవస్నాన ఉత్సవాన్ని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జగన్నాథ స్వామి రథయాత్రకు ముందు వచ్చే జ్యేష్ఠ పౌర్ణమి రోజున ఈ పవిత్ర మహోత్సవాన్ని నిర్వహిస్తారు. శ్రీ జగద్గురు రామానుజ కాశీపీఠ సేవాశ్రమ పీఠాధిపతి స్వామి రిగ్వేదాచార్యజీ మహారాజ్ పర్యవేక్షణలో జరిగిన దేవస్నాన ఉత్సవంలో ఆలయ నిర్వాహకులు ప్రమోద్ కుమార్ అగర్వాల్, గోవింద్ లోహియా, జ్యోతీధర్ సింగ్, ఎం.ప్రభాకర్‌రాజ్ ముదిరాజ్, బస్తీవాసులు పాల్గొన్నారు. కాగా స్నానం చేసిన తరువాత జగన్నాథ స్వామికి జ్వరం వస్తుందని విశ్వసిస్తారు. అందువల్లే జగన్నాథుడు 15 రోజుల పాటు భక్తులకు దర్శనం ఇవ్వరు. ప్రత్యేక విరామ గదిలో ఉంటారు. ఆ సమయంలో శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవికి ప్రత్యేక ఔషదాలతో లేపనాలు చేస్తారు. విశ్రాంతి, అనవసర కాలం ముగిసిన తరువాత స్వామివారు నవయవ్వన రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆ మరుసటి దినం జగన్నాథ స్వామి భక్తులకు దర్శనం ఇవ్వటానికి రథంపై వీధుల్లో విహరిస్తారు. దీనినే జగన్నాథ రథయాత్రగా పిలుస్తారు.

శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవిలకు పవిత్ర జలంతో స్నాన కార్యక్రమం చేస్తున్న అర్చకులు

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరగాలి : ఆరోక్య దాస్

కంటోన్మెంట్,జూన్ 29 ప్రభాతవార్త: విద్యార్థులు నిజాయితీగా తమ వ్యక్తిత్వాన్ని అలవర్చుకొని విద్యా పరంగా అభివృద్ధి చెంది మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని డాక్టర్ విన్‌సెంట్ ఆరోక్య దాస్, పౌండర్ ఛైర్మన్ టీ.బాల రెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం 6వ వార్డు బోయిన్‌పల్లి సీతారాంపూర్ సెయింట్ పీటర్స్‌హై స్కూల్‌లో నిర్వహించిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. విశ్వాసం, ధైర్యం,సేవా భావాన్ని హృదయానికి హత్తుకునేలా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడా, క్విజ్ పోటీలలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను కరస్పాండెంట్ టీ.ఏ.రెడ్డి,ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సువర్ణలు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

చిన్నతనం నుంచి ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలి : తిరిమలగిరి ట్రాఫిక్ ఎసిపి శంకర్ రాజు

అల్వాల్, జూన్ 29 ప్రభాతవార్త: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్‌పై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని తిరిమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఎసిపి శంకర్ రాజు పేర్కొన్నారు. సోమవారం అల్వాల్‌లో ఓ ప్రైవేటు పాఠశాలలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో బాగంగా ఎసిపి విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలకు వివరించారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా జరుగుతున్న ప్రమాదాలను తెలిపారు .మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్డు దాటడం, వాహనాలు నడపడం మాను కోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన తరువాత మాత్ర మే హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. ట్రాఫిక్ నియమావళిని కచ్చితంగా పాటించిన నాడు రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయన్నారు. మైనర్లు డ్రైవింగ్ నిషేదమన్న ఆయన లైసెన్స్ వచ్చిన తరువాత మాత్రమే రోడ్ల పైకి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, అదనపు ఇన్‌స్పెక్టర్ హరిలాల్, ఎస్ఐ కిషోర్ పాఠశాల ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎసిపి

విజేత హైదరాబాద్ హీరోస్ రగ్బీ ప్రీమియర్ లీగ్

విజేతగా నిలిచిన హైదరాబాద్ హీరోస్ జట్టు

హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త: హైదరాబాద్ హీరోస్ జట్టు, గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన థ్రిల్లింగ్ ఫైనల్‌లో ముంబై డ్రీమర్స్‌ను 41-17 తేడాతో ఓడించి, రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 చాంపియన్లుగా నిలిచిసీజన్ 2 టైటిల్ గెలుచుకున్నారు.తొలిసారిగా డ్రీమర్స్ బంతిని అదుపులో ఉంచుకున్నప్పటికీ, హైదరాబాద్ క్రమశిక్షణతో కూడిన రక్షణ కీలకమైన టర్నోవర్‌లు సాధించడం వల్ల పాయింట్లుగా మార్చుకోలేకపోయారు. ఫ్రాన్సిస్కో కాస్కుల్లుయేలాస్టిల్ తైతైఫోనో తావి తాకు అవకాశం కల్పించగా, మాన్యుయెల్ మొరెనో బంతిని గెలుచుకొని శివమ్ శుక్లాకు సులభంగా స్కోర్ చేసే అవకాశం కల్పించడంతో హీరోస్ వేగంగా కౌంటర్ అటాక్స్ ద్వారా స్కోర్ చేశారు. తర్వాత మారిస్ లాంగ్‌బాటమ్ డ్రాప్ గోల్ కొట్టడంతో హైదరాబాద్ విరామ సమయానికి పూర్తి నియంత్రణ సాధించింది.విరామం తర్వాత కూడా హీరోస్ తమ వేగాన్ని కొనసాగించారు.తావితా మళ్ళీ ఎడమ వైపు స్థలం కల్పించగా డియాగో అర్డావో స్కోర్ చేశాడు. ముంబై చివరకు మెరుగైన బంతి కదలిక ద్వారా ఇతన్ మెక్‌ఫర్లాండ్‌కు అవకాశం కల్పించి స్కోర్ చేసింది. అయినప్పటికీ హైదరాబాద్ టర్నోవర్‌లను వాడుకుంటూనే ఉంది. అర్డావో తన రెండవ ట్రై చేయగా కెవిన్ వెకేసా వెడల్పుగా ఒక ఫ్లోయింగ్ మూవ్‌ను ముగించాడు. తేరియో తమని చివరి క్వార్టర్ ప్రారంభంలో ఆధిక్యాన్ని పెంచగా, జేమ్స్ టర్నర్ డ్రీమర్స్ కోసం ఒక ట్రై చేసి తర్వాత చివరి దశలో సుకుమార్ హెంబ్రోమ్‌కు సహాయం చేశాడు. అయినప్పటికీ, హైదరాబాద్ యొక్క నిర్ణయాత్మక ఫినిషింగ్ మరియు రక్షణాత్మక తీవ్రత వారికి ఘన విజయం అందించింది.

ఆర్య వైశ్యుల నైతిక విలువలలో ఆవిష్కరణలే ప్రధానమైనవి

-ఏపీ మంత్రి టి.జి.భరత్ గుప్త

జ్యోతి వెలిగించి అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం సమావేశం ప్రారంభిస్తున్న ఏపీ మంత్రి టి.జి.భరత్ గుప్త

హైదరాబాద్ జూన్ 29 ప్రభాతవార్త : ఆర్య వైశ్యుల నైతిక విలువలలో ఆవిష్కరణలే ప్రధానమైనవని, ఇవి యువ తరాలను సృజనాత్మకంగా ఆలోచించడానికి, వ్యవస్థాపకతలో సాహసాలు చేయడానికి ప్రోత్సహిస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి పరిశ్రమ శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్త అన్నారు.అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేతల ఫోరమ్ జాతీయ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారమహోత్సవం కార్యక్రమానికి మంత్రి టీ.జి.భరత్ గుప్తతో పాటు మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగల, పసుపు బోర్డు ఎండి భవాని శ్రీ, సీఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, జీఎస్టీ కమీషనర్ సాయికిషోర్, బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్, టీపీసీసీ ప్రచార కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, టీజీవోఏ అధ్యక్షుడు కృష్ణమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ ఉప కార్యదర్శి లింగమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేతల ఫోరం నూతన జాతీయ అధ్యక్షులుగా భవాని సురేష్ చారుగుండ్ల. ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ ఎర్రం,ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్ పడకంటి, సంయుక్త కార్యదర్శిగా వంశీ నెలాంటి, కోశాధికారిగా శివకుమార్ బొగ్గరితో సహా 47 మంది జాతీయ కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసారు. అనంతరం టీ.జి.భరత్ ఫోరమ్ పారిశ్రామిక ప్రదర్శన లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ అనేది ఆర్య వైశ్య సమాజానికి చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకులు, వ్యాపార నాయకులను అనుసంధానించే ఒక జాతీయ వేదికగా ఏర్పడడం గర్వకారణం అని అన్నారు. నేను రాజకీయ నేతతోపాటు యువ పారిశ్రామికవేత్తను కూడా అని, నన్ను కూడా ఆల్ ఇండియా ఆర్య వైశ్య ఇండస్ట్రియలిస్ట్స్ ఫోరమ్ సభ్యత్వం ఇవ్వాలని, ఫోరమ్ పటిష్టతకు కృషి చేస్తానన్నారు

హైడ్రా ప్రజావాణికి 54 ఫిర్యాదులు

హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త: కబ్జాలతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పార్కు స్థలాన్ని కబ్జా చేసి కాలనీవాసులు సేదదేరేందుకు అవకాశం లేకుండా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పక్కనే వరద కాలువ ఉన్నా.. కారు పార్కింగ్ పేరిట కబ్జాలు చేసి కాలనీ వరదకు కారణమౌతున్నారని మరో ఫిర్యాదు. ఉన్న దారిలో 10 అడుగుల మేర కాలనీ రహదారులను కబ్జా చేసి రాకపోకలకు ఇబ్బందులు పెడుతున్నారని.. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్లోని మహేంద్రహిల్స్ వార్డు నంబరు 5లో ఉన్న వరద కాలువకు కాలనీ దారులలోంచి వెళ్లాల్సిన వర్షపు నీరు వెళ్లకుండా అక్కడి వారు ఆటంకాలు సృష్టిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో మహేంద్ర హిల్స్‌లో రహదారులు చెరువుల్లా మారుతున్నాయని పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి మండలం, విలేజ్‌లో చెక్‌పోస్టు ప్రాంతంలో సాయి శ్రీనిలయ రెసిడెంట్స్ కాలనీ వరద, మురుగు నీటి కాలువలనుంచి బయట ఉన్న ప్రధాన కాలువకు అనుసంధానం చేయడానికి అభ్యంతరాలు చెప్పడంతో నానా అవస్థలు పడుతున్నామని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ చెరువుకు ఆనుకుని ఉన్న కాలువకు కాలనీ వరదనీటి కాలువలు అనుసంధానం చేసేలా చూడాలని కోరారు. అలాగే ఇదే కాలనీలోని పార్కు స్థలం 400ల గజాల వరకూ కబ్జా అయ్యిందని.. వెంటనే ఆక్రమణలు తొలగించి పార్కును కాపాడాలని అక్కడి వారు హైడ్రాకు వినతిపత్రం అందజేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 54 ఫిర్యాదులందగా.. వీటిని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

ఇంజనీరింగ్ బీకేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలి

- ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల వ్యాపారాన్ని నిలువరించాలి

-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా

మెహదీపట్నం, జూన్ 29, ప్రభాతవార్త : ఇంజనీరింగ్ బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయడంతో పాటు, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల వ్యాపారాన్ని నిలువరించాలని ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలనే డిమాండ్ తో సోమ వారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్ లోని ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో పోలీసులకు, ఏఐఎస్ఎఫ్ నాయకులకు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేసి ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ లు మాట్లాడుతూ...రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల దోపిడి చేస్తున్నాయని ఆరోపించారు. ఇంజనీరింగ్ విద్యను పూర్తిగా వ్యాపా రమయంగా మార్చడంతో పాటు యాజమాన్య కోటా సీట్లను లక్షలాది రూపాయలకు అమ్ముకుం టున్నారన్నారు. డిమాండ్ ఉన్న కోర్సు సీట్లకు ఇష్టానుసారంగా ఫీజులు పెంచు తూ, సీట్లను బ్లాక్ లో పెడుతూ మెరిట్ విద్యార్థులకు సీట్లు ఇవ్వకుండా లక్షల రూపాయల ఫీజులు కట్టేవా రికి సీట్లు ఇవ్వడంతో మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కళాశాలలు యాజమాన్య సీట్ల భర్తీలో నిబంధనలు పా టించకుండా భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంజనీరింగ్ కళాశాలల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని నిబంధనలు పాటించని ఇంజనీరింగ్ కళాశా లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేర ర్స్ రఘురాం నాయక్, గ్యార నరేష్, రెహమాన్ రాష్ట్ర కౌన్సి ల్ సభ్యులు ఏం.డి అన్వర్, అనిల్, దత్తురెడ్డి, ఆకాష్ నాయ క్, శాంతి కుమార్, లెనిన్, హరీష్ నాయకులు అశ్విన్, యశ్వంత్, చట్ల సమ్మయ్య, రాహుల్, లోకేష్, వినోద్ సిద్దులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ దేవాలయంలో వైభవంగా రుద్రసహిత చండీ హోమం

ముషీరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త: లోయర్ ట్యాంక్‌బండ్‌పై నున్న శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో శ్రీ రుద్ర సహిత చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ తెలిపారు. హోమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ఛైర్మన్ గోల్కొండ గౌతం కుమార్ పటేల్, ఆలయ కార్యనిర్వాహణాధికారి మహేందర్‌గౌడ్ మరియు భక్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL JUNIOR CIVIL JUDGE-CUM-X ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS
AT :: MEDCHAL
O.S.NO. 252 OF 2026
BETWEEN:-
P VISWANATHA CHARY & OTHERS
R/o. H.No. 188/30, Prasoona Nagar, OppChanikya Model School, Chintal, Telangana - 500054.
....Plaintiffs
AND
THE TAHSILDHAR QUTHBULLAPUR & ALL OTHERS CONCERNED
....Defendants
NOTICE
Whereas the plaintiffs filed a suit for Legal Heir against defendants and plaintiffs filed a petition for Legal Heiragainst Tahsildhar quthbullapur &all others concerned the and you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating the suit. The suit is posted for your appearance on: 01-07-2026. AT 10.30 AM and as the day fixed for your appearance is appointed for the final disposal of the suit, if you are not appear before the "IN THE COURT OF THE HON'BLE III ADDL JUNIOR CIVIL JUDGE-CUM-X ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT : MEDCHA" the matter will be decided on the facts of the suit.
// BY ORDER OF THE COURT //
Sd/-
SHANKAPALLI SANTHOSH KUMAR
(TS/260/2016)
K. HARI KRISHNA,
ADVOCATES
H.No: 29-391/11,
Madhura Nagar, Neredmet, Near SRO Off, Vajpayee Nagar, Neredmet, Telangana - 500 056
Phone: 990-856-8559, 9948345141

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
నిట్ నం. & తేది: నిట్ నం. 08/DB/EE-III/JDM/C-55/QBZ/CMC/2026-27, తేది: 29.06.2026. పని పేరు: (7 పనులు) BT/CC రోడ్‌లు యొక్క నిర్మాణం, హై మాస్ట్ పోల్స్, AB కేబుల్ మరియు పొడైన స్తంభాలు తిరిగి నెలకొల్పుట, స్టేషనరీ ఐటమ్‌లు CC రోడ్. అంచనా మొత్తం లక్షలలో: 38.186 లక్షలు. ప్రారంభ తేదీ & సమయం: 30.06.2026 మ.3.00 గం. వద్ద. బిడ్ స్వీకరణలకు చివరి తేదీ & సమయం: 03.07.2026 మ.3.00 గం. మొబైల్ నం.తో టెండర్ ఆహ్వానించు అధికారి వివరాలు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నం: 9989930549, హెడ్ డ్రాఫ్ట్‌మన్: సెల్ నం: 8712034411. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III, JDM C-55, CMC
DIPR.No.5137-PP/CL/Advt/1/2026-27, తేది: 29.06.2026

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
నిట్ నం. 12/EE-22/RJNRZ/GHMC/2026-27, తేది: 29.06.2026, పని యొక్క పేరు: 2026 సంవత్సరానికి GHMC, రాజేంద్రనగర్ జోన్, సర్కిల్-22, ఫలక్‌నుమాలో 6 నం.ల యొక్క పనులు. అంచనా ధర: (రూ.లక్షలలో) 89.50. బిడ్స్ స్వీకరణలకు ప్రారంభ తేదీ/చివరి తేదీ & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 29.06.2026 మ.3.00 గం. వద్ద. బిడ్స్ స్వీకరణకు చివరి తేది: 02.07.2026 మ.3.00 గం. వద్ద. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ బి. వెంకట శేషయ్య, EE-21, సర్కిల్-22 రాజేంద్రనగర్ జోన్, పూల్‌బాగ్, చాంద్రాయణగుట్ట, హైదరాబాద్. ఫోన్ నం: 9492067578. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఫలక్‌నుమా సర్కిల్-22, రాజేంద్రనగర్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.5132-PP/CL/Advt/1/2026-27, తేది: 29.06.2026

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AND ARBITRATION, HYDERABAD (SOUTH) AT AMEERPET, HYDERABAD
[illegible]
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS AND ARBITRATION
[illegible]
COUNSEL FOR DISPUTANT

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AND ARBITRATION, HYDERABAD (SOUTH) AT AMEERPET, HYDERABAD
[illegible]
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS AND ARBITRATION
[illegible]
COUNSEL FOR DISPUTANT

OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR HYDERABAD (SOUTH), MYTHRI VIHAR COMMERCIAL COMPLEX, AMEERPET, HYDERABAD
[illegible]
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR
M. SHIVA SHEKAR
M. CHANDRA SEKHAR
Advocates
[illegible] PARSIGUTTA, SEC-BAD

OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS ARBITRATOR HYDERABAD (SOUTH), MYTHRI VIHAR COMMERCIAL COMPLEX, AMEERPET, HYDERABAD
[illegible]
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR
M. SHIVA SHEKAR
M. CHANDRA SEKHAR
Advocates
[illegible] PARSIGUTTA, SEC-BAD

OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR, HYDERABAD (SOUTH), MYTHRI VIHAR COMMERCIAL COMPLEX, AMEERPET, HYDERABAD
[illegible]
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR
M. SHIVA SHEKAR
M. CHANDRA SEKHAR
Advocates
[illegible] PARSIGUTTA, SEC-BAD

OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR, HYDERABAD (SOUTH), MYTHRI VIHAR COMMERCIAL COMPLEX, AMEERPET, HYDERABAD
[illegible]
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR
M. SHIVA SHEKAR
M. CHANDRA SEKHAR
Advocates
[illegible] PARSIGUTTA, SEC-BAD

OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR, HYDERABAD (SOUTH), MYTHRI VIHAR COMMERCIAL COMPLEX, AMEERPET, HYDERABAD
[illegible]
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR
M. SHIVA SHEKAR
M. CHANDRA SEKHAR
Advocates
[illegible] PARSIGUTTA, SEC-BAD

OFFICE OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR, HYDERABAD (SOUTH), MYTHRI VIHAR COMMERCIAL COMPLEX, AMEERPET, HYDERABAD
[illegible]
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR
M. SHIVA SHEKAR
M. CHANDRA SEKHAR
Advocates
[illegible] PARSIGUTTA, SEC-BAD

మాజీ ప్రధాని పివి సేవలు ఎనలేనివి : చౌకి రవికుమార్

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, జూన్ 29,ప్రభాతవార్త:
దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు దేశానికి చేసిన సేవలు ఎనలేనవని కాంగ్రెస్ ఒబిసి వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పేర్కొన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 105వ జయంతి సందర్భంగా చౌకి రవికుమార్ నాయకులు, కార్యకర్తలు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన ఘనత పివికే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అజంపుర డివిజన్ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, పందిరి రాము, రాజేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : ఫెడ్ చైర్మన్ గంగారాం

వివిధ రంగాలలో రాణించిన వారికి హెలెన్ కెల్లర్ సన్మాన పురస్కారాలు అందజేస్తున్న గంగారాం, చెరుకు నాగభూషణం తదితరులు

మలక్ పేట, జూన్ 29, ప్రభాతవార్త:
హెలెన్ కెల్లర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఫెడ్ చైర్మన్ గంగారం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణంలు పేర్కొన్నారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ ద డిజేబుల్ సంస్థ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రముఖ సామాజిక ఉద్యమకారిని అయిన హెలెన్ కెల్లర్ చెవిటి, మూగ మరియు అంధత్వ వైకల్యాలు ఉన్నప్పటికీ ఏ మాత్రం బాధపడకుండా ఒక అసిస్టెంట్ ని ఆధారం చేసుకుని ప్రముఖ విద్యావేత్తగా, రచయితగా సామాజిక సంఘసంస్కర్తగా రాణించారని వివరించారు. ప్రపంచ దేశాల్లోని వికలాంగులతో పాటు సమాజంలోని మహిళలు తదితరులకు తనవంతు సహాయ, సహకారాలను అందించారని, ఇది వికలాంగుల సమాజానికి మొత్తం గర్వకారణం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎల్ఐసి వారి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడ్ చైర్మన్ గంగారాం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, డాక్టర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అమ్మ జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షులు వీరబోయిన భద్రయ్య యాదవ్, విహెచ్‌పి పిఎస్ అధ్యక్షులు గోపాల్ ఇతర అతిథులు ఆయా రంగాల్లో రాణించిన అంధులకు, బాధిరులకు, అంగవైకల్యం గల వారికి హెలెన్ కెల్లర్ సన్మాన పురస్కారాలను అందజేశారు.

ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
: ఎమ్మెల్యే అహ్మద్ బలాల

ఎస్ఐఆర్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చిత్రంలో అబ్రార్ తదితరులు

మలక్ పేట, జూన్ 29, ప్రభాతవార్త:
ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయక కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటర్ లిస్ట్ లో నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం మలక్ పేట నియోజకవర్గంలో చురుకుగా జరుగుతోందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైనదని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తమ పేరు తప్పనిసరిగా జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. తమ పేర్లతో పాటు కుటుంబంలోని ప్రతి సభ్యుల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వినియోగించుకుని ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలి
-డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్ జూన్ 29, ప్రభాతవార్త
పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మరియు టీపీసీసీ రాష్ట్ర నాయకులు కొత్త కుర్మా శివకుమార్ అన్నారు. ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా అధిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్ డివిజన్ శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన చిన్నారులకు స్వయంగా పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమంలో పాల్గొని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు సమాజాన్ని పోలియో రహితంగా నిలబెట్టవచ్చని తెలిపారు. పోలియో నిర్మూలనలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన ప్రశంసించారు. చిన్నారులు ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా తల్లిదండ్రులు సమీపంలోని పోలియో బూత్‌లకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోఅంగన్వాడీ టీచర్ స్వప్న, ఏఎన్ఎం పద్మ, నాయకులు మేతరి శంకర్, యశ్వంత్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

బంగారు మైసమ్మ దేవాలయం వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆలయ కమిటి నేతలు

రామంతాపూర్, జూన్ 29 ప్రభాతవార్త : రామంతాపూర్ ఆర్‌టిసి కాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం 19వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాలనీ కమిటి సంఘం గౌరవ అధ్యక్షులు వసుల ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షులు ఎ.సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పి దయాకర్ రెడ్డి, కోశాధికారి ఈ. చంద్రశేఖర్, దేవాలయ నిర్వాహకులు ఎస్. జ్ఞానేశ్వర్ తదితరుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్ వరణం, రక్షా బంధనం, హోమం, పంచగవ్య ప్రాశనం, పుష్పార్చన, తీర్థప్రసాదాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేపట్టారు. ఆర్.టి.సి. కాలనీలో శక్తి స్వరూపిణిగా వెలసిన శ్రీ బంగారు మైసమ్మ తల్లి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడ కాలనీల్లో ఖాళీ ప్లాట్లల్లో పారిశుధ్య సమస్యలు

-చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు, డిస్మెంటల్ వ్యర్థాలతో ఇబ్బందులు
-దోమలు, పాముల బెడదతో ఆందోళనకు గురవుతున్న స్థానికులు
-అధికారుల దృష్టికి తెచ్చి సమస్యను తీర్చిన కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి

ఖాళీ ప్లాట్లలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త: గృహాల మధ్య పారిశుధ్యపరంగా స్థానికులకు ఇబ్బందికంగా మారిన ఖాళీ ప్లాట్లు ఉన్న కాలనీల్లో ఓ కాంగ్రెస్ నాయకుని చొరవతో సమస్య పరిష్కారం అయ్యింది. సదరు కాంగ్రెస్ నాయకుని కృషి ఫలితంగా ఖాళీ ప్లాట్లలో చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలను సానిటేషన్ సిబ్బంది తొలగించి శుభ్రం చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేసి హస్తం నేతకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సేవలో ఉన్న పలువురికి స్పూర్తిగా నిలిచిన ఈ సేవా కార్యక్రమానికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్-57 పరిధిలోని అల్మాస్‌గూడకు సంబంధించిన అమరావతి కాలనీ, షిర్డీనగర్, న్యూ మధురాపురి కాలనీ, సిఎంఆర్ కాలనీలలో చాలా వరకు గృహాలు ఉన్నా వాటి మధ్యలో అక్కడక్కడా కొన్ని ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. ఇళ్ళ నిర్మాణాలు జరగకపోవడంతో సదరు ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి చెత్తా చెదారమై డంపింగ్ ప్రాంతాలుగా మారాయి. కొంత మంది బయటి వ్యక్తులు ఏకంగా ఇళ్ళ డిస్మెంటల్‌ను, ఇతర వ్యర్థాలను తెచ్చి పారబోస్తుండడంతో ఓపెన్ ప్లాట్లు కాస్తా డంపింగ్ ప్రదేశాలయ్యాయి. దీంతో స్థానిక కాలనీల ప్రజలు పారిశుధ్య సమస్యలతో పాటు దోమలు, పాముల బెడద పట్ల ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఉన్న అధికారులు వీరి సమస్యను పట్టించుకోకపోవడంతో సమస్యలు యథాతథంగా ఉన్నాయి. అయితే ఇటీవల కాలంగా అల్మాస్‌గూడలోని కాలనీల సమస్యలపై దృష్టి సారిస్తూ పరిష్కరింపజేస్తూ వస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డికి స్థానిక సంక్షేమ సంఘాల వారు, కాలనీల ప్రజలు ఓపెన్ ప్లాట్ల సమస్యలను వివరించారు. ఈ నేపథ్యంలో స్పందించిన ఆయన ఇటీవల ఆయా కాలనీల్లో పర్యటించి పారిశుధ్య సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో సంబంధిత అధికారులను కలిసి ఖాళీ స్థలాల్లో పారిశుధ్య సమస్యలను స్వయంగా వివరించారు. ఈ మేరకు జెసిబిలను పంపి పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయన కోరడం జరిగింది. ఎట్టకేలకు స్పందించిన అధికారులు సోమవారం జెసిబిలను, ట్రాక్టర్లను, పారిశుధ్య సిబ్బందిని పంపి ఓపెన్ ప్లాట్లల్లో పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాలను, భవన డిస్మెంటల్ వ్యర్థాలను తొలగించి అక్కడి నుండి తరలించారు. ఈ పనులను ప్రత్యక్షంగా మల్లారెడ్డి కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. అయతే దీర్ఘకాలంగా ఉన్న ఖాళీ స్థలాల పారిశుధ్య సమస్య పరిష్కారం కావడం పట్ల కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు సమస్యను తీర్చిన కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డికి అదే విధంగా బడంగ్‌పేట్ సర్కిల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘాలకు చెందిన వెంకట రమణ, రేవంత్, ఈశ్వర్, శిరీష్‌రెడ్డి, అంజయ్యగౌడ్, అశోక్, నాగార్జున, అంజయ్యచారి, పవన్, శ్యామ్‌రెడ్డి, మహేష్, కిరణ్, శివకుమార్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల చెరువు సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చిన చెరువుల పరిరక్షణ సమితి

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న మీర్‌పేట్ చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు

సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త: ప్రజలకు సంబంధించిన మరో సమస్య పరిష్కారానికి మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్ చెరువుల పరిరక్షణ సమితి నడుం బిగించింది. గతంలో ఇక్కడి చెరువుల సమస్యలపై పోరాటాలు చేసి సత్ఫలితాలు, విజయాలు సాధించిన పేరు చెరువుల పరిరక్షణ సమితికి ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ మధ్య కాలంలో మీర్‌పేట్‌లోని ప్రధానమైన మంత్రాల చెరువు దుస్థితిని పరిశీలించిన చెరువుల పరిరక్షణ సమితి సమస్యను పరిష్కరింపజేయాలని నిర్ణయించింది. ఓ వైపు ఆర్‌సిఐ రోడ్డు మరో వైపు చెరువు చుట్టూ పలు కాలనీలు ఉన్న నేపథ్యంలో చెరువుకు సంబంధించిన సమస్యల వల్ల పరిసర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారితో పాటు ప్రతి రోజు వాకింగ్, వ్యాయామం, యోగా కోసం వచ్చే వారు సైతం ఇక్కడి పరిస్థితుల కారణంగా తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. చెరువు తీర ప్రాంతంలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అశుభ్రంగా ఉండడం... డ్రైనేజీ నీరు చెరువులోకి కలుస్తుండడం వల్ల తీవ్ర దుర్వాసన, కాలుష్యం ఏర్పడడం... వాకింగ్ ట్రాక్ దెబ్బతినడం.. చెరువు చుట్టూ సరైన ఫెన్సింగ్, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం.. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడం.. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులకు గురికావడం.. క్రమంగా చెరువులో గుర్రపు డెక్క విస్తరించడం తదితర సమస్యలపై చెరువుల పరిరక్షణ సమితి దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో సమితి ప్రతినిధులు బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య దృష్టికి తెచ్చి సోమవారం కార్యాలయంలో ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపి చెరువు వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిసిని కోరారు. ఈ నేపథ్యంలో సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమీషనర్ అప్పటికప్పుడు చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధుల సమక్షంలోనే సంబంధిత అధికారులు తన ఛాంబర్‌కు రప్పించుకొని చెరువు ప్రాంతాన్ని సందర్శించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అదే విధంగా ఎస్ఎన్‌డిపి నాలాకు సంబంధించి నోట్ ఫైల్‌ను ఎగ్జికూటివ్ ఇంజనీర్‌కు పంపించాలని సూచించారు. వినతి పత్రం సమర్పణ కార్యక్రమంలో చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు, రమేష్, హారతిదేవి, నీరజ, వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీమాన్ నారాయణ, సీతారామయ్య, జంగారెడ్డి పాల్గొన్నారు.

డోర్ టు డోర్ ఎన్యూమరేషన్ ప్రారంభం

-ప్రజలు పూర్తిగా వివరాలు నమోదు చేసి ఫారాలు సమర్పించాలి : డిసి సత్యనారాయణ రెడ్డి



తుర్కయంజాల్, జూన్ 29 (ప్రభాతవార్త)
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం జిహెచ్‌ఎంసి ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ రాగన్న గూడ పరిధిలో డోర్‌టుడోర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ మరియు ఆదిభట్ల సర్కిల్15 అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, బీఎల్‌ఓలు, ఎన్యూమరేటర్లు, బీఎల్ఓ సూపర్వైజర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. అధికారులు ప్రజలకు ఫారాలను పూర్తిగా, తప్పులు లేకుండా నింపి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జత చేసి నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్‌ఓలకు సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ప్రతి అర్హ ఓటరు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, అందరూ బాధ్యతగా స్పందించి ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వాటర్ బోర్డ్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే మర్రికి వినతి



మల్కాజిగిరి జూన్ 29, ప్రభాతవార్త:
మల్కాజిగిరి వాటర్ బోర్డ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. మల్కాజిగిరి వాటర్ బోర్డ్ ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు బి. కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో ఉద్యోగుల ప్రతినిధి బృందం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి ప్రధానంగా క్రింది డిమాండ్లను తీసుకువచ్చారు. వాటర్ బోర్డ్ సబ్‌స్టేషన్లలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాల వల్ల చనిపోయిన ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఉద్యోగ అవకాశం (కారుణ్య నియామకం) కల్పించాలని కోరారు. ప్రస్తుత జీవన వ్యయానికి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే హామీ:కార్మికుల సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. జీతాల పెంపుదల మరియు చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించే విషయాలపై సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులతో, మంత్రులతో మాట్లాడి తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి గౌడ్‌తో పాటు వాటర్ బోర్డ్ ఔట్ సోర్సింగ్ యూనియన్ ఉద్యోగులు నాగరాజు మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మల్కాజిగిరి జూన్ 29, ప్రభాతవార్త:
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వసంత పూరి కాలనీ లో సుమారు 12 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వసంత పూరి కాలనీ అసోసియేషన్ సభ్యులు అశోక్ చారి, భాను ప్రకాష్, యోగేశ్వర్ రావు, రవి అయ్యర్, శివమణి, నాగేష్, ప్రసాద్, విద్యా సాగర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్య మూర్తి బాబు సత్యనారాయణ బ్రహ్మయ్య రామక్రిష్ణ రాము తదితరులు పాల్గొన్నారు .

సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి

పద్మావతి కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న లచ్చిరెడ్డి

వనస్థలిపురం జూన్ 29,ప్రభాతవార్త
ఉమ్మడి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పద్మావతి కాలనీలో సంక్షేమ సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు కాలనీలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఒకటొకటిగా కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, రాంబాయ్, సుభాష్, కిరణ్, ఎంఎస్ రెడ్డి, రఘురాం మరియు తదితరులు ఉన్నారు.

మహిళలకు వరంగా ఇందిరమ్మ చీరలు : రజితరెడ్డి

ఉప్పల్ హిల్స్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 29 ప్రభాతవార్త : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ హిల్స్‌లో చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో నాసిరకం చీరలు ఇచ్చి మహిళల గౌరవాన్ని తగ్గించారని, కానీ ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత నాణ్యమైన, చేనేత కార్మికులు రూపొందించిన చేనేత చీరలను సారెగా అందిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తోందన్నారు. సోనియా గాంధీ ఆశయాల స్ఫూర్తితో మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రతి ఆడబిడ్డకు ఈ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తాము నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు దుర్గం నవీన్ యాదవ్, గోవింద్, శ్రీనివాస్ రెడ్డి, సల్లా ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కుమార్ . కుమార్ స్వామి, అక్కు రవి, ఆర్.పి.దివ్య, అర్చన, దుర్గం రేణుక, శ్రావణి తదితరులు పాల్గొన్నారు

వైభవంగా కనక దుర్గ ఆలయం శిఖర ప్రతిష్ఠాపన

ఉప్పల్ బ్యాంక్ కాలనీలోని శ్రీ కనక దుర్గ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆలయ కమిటి నేతలు

ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త : ఉప్పల్ బ్యాంక్ కాలనీలోని శ్రీ కనక దుర్గ ఆలయంలో సింహవాహన, బలిపీఠ, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం ముగిశాయి. గత శనివారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు.. ఆలయ కమిటి అధ్యక్షుడు ఎస్.వినోద్ కుమార్ ఉపాధ్యక్షుడు జె.రమేష్ గౌడ్, కార్యదర్శి టి.సందీప్ భూషణ్, కోశాధికారి టి. మనోజ్ కుమార్, కార్యనిర్వహక కార్యదర్శి శేఖర్ మోర్, సభ్యులు వి వెంకటేశ్వర్లు కె విజయ్ కుమార్ ఇ రాజమణి ఎన్ శ్రీనివాస్, వాలంటీర్లు జి. ప్రదీప్ కుమార్, శ్రీ లత, జ్యోతి, సుజాత, పార్వతి, జ్యోతిర్మయి, కిరణ్మయి, సునీత తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం మూలా నక్షత్రయుక్త కర్కాటక లగ్న పుష్కరాంశ సుముహూర్తమున గణపతి పూజ, ఆదివాస హోమాలు, శేషహోమాలు, గర్తన్యాసం, రత్నాన్యాసం. సుముహూర్తమున సింహ వాహన, బలిపీఠ, శిఖర యంత్ర స్థాపన శ్రీశ్రీశ్రీ మాధవానంద స్వామి కరకమలములచే యంత్ర విగ్రహ స్థాపనం యతివర బలిప్రదానం, పూర్ణాహుతి, దర్శనం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బడంగ్‌పేట్ సర్కిల్‌లోని ప్రశాంతిహిల్స్ డివిజన్ నందిహిల్స్ కాలనీలో సోమవారం బూత్‌ల వారీగా ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న బిఎల్‌ఓలు

రైతుల సంక్షేమమే లక్ష్యం

తుర్కయంజాల్, జూన్ 29,ప్రభాతవార్త
ఆదిభట్ల సర్కిల్ పరిధి జీహెచ్ఎంసీ తుర్కయంజాల్ డివిజన్ లో రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో సోమవారం నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ సందర్భంగా సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య సంఘం జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, అభ్యున్నతి, ఆర్థిక పురోభివృద్ధే తమ పాలకవర్గం ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన పంట రుణాలు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయానికి సంబంధించిన అన్ని సహకార సేవలను ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. రైతు సేవా సహకార సంఘంపై రైతుల్లో మరింత విశ్వాసం పెంపొందించేలా సేవలను విస్తరించడంతో పాటు, సంఘాన్ని జిల్లాలోనే ఆదర్శ సహకార సంఘంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గ సభ్యులందరూ సమిష్టిగా కృషి చేస్తారని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం సంఘం నూతన పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, రైతుల ఆశయాలకు అనుగుణంగా పనిచేసి సహకార సంఘ ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ సభ్యులు కొత్త రామ్‌రెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కోతాడి నరసింహారావు, వంగేటి లక్ష్మారెడ్డి, కొండ్రు స్వప్న, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, చెక్క కృష్ణారెడ్డి, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, జక్క రామ్‌రెడ్డి, జిట్ట భార్గవితో పాటు పలువురు రైతులు, సంఘ సభ్యులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభం సమస్య పరిష్కారం

వంగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం వద్ద కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త: మీర్‌పేట్, జిల్లెలగూడ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చొరవతో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం సమస్య పరిష్కారం అయ్యింది. జిహెచ్‌ఎంసి జిల్లెలగూడ-59 డివిజన్‌లోని న్యూ గాయత్రీనగర్ క్రాస్ రోడ్స్ రోడ్ నెంబర్ 1 మలుపులో 11 కెవిఐ హైటెన్షన్ లైన్ విద్యుత్ స్తంభం చాలా రోజులుగా వంగి పడిపోయే స్థితిలో ఉండడాన్ని గమనించిన కాలనీవాసులు ఫెడరేషన్ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో స్పందించిన నాయకులు ఈ సమస్యను విద్యుత్ శాఖ ఎస్ఇ, డిఇ, ఎఇల దృష్టికి తీసుకెళ్ళి వివరించారు. దీంతో అధికారులు ఎమర్జెన్సీ వర్క్ కింద చర్యలు తీసుకొని సోమవారం ఎఇ బాలాగౌడ్, సిబ్బందిని పంపి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్థంభాన్ని సరి చేయించారు. అదే విధంగా గాయత్రీనగర్‌లో విద్యుత్ వైర్లకు ఇబ్బందికంగా మారిన చెట్ల కొమ్మలను కూడా భారీ క్రేన్ సాయంతో తొలగించారు. ప్రజా సమస్యపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకున్న విద్యుత్ అధికారులకు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, డివిజన్ బిజెపి నేత వంటేరు నర్సింహారెడ్డి, ఫెడరేషన్ ప్రతినిధులు జాజాల మల్లారెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రేమ్‌చంద్రారెడ్డి, ఫణికిరణ్ తదితరులు ఫెడరేషన్, కాలనీవాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

మర్ల మైసమ్మ ఆలయానికి మధుసూధన్‌రెడ్డి విరాళం



చిలుకానగర్ మర్ల మైసమ్మ ఆలయానికి విరాళం అందజేస్తున్న బిఆర్ఎస్ సీనియర్ నేత గుడి మధుసూధన్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 29 ప్రభాతవార్త : చిలుకానగర్‌లోని మర్ల మైసమ్మ ఆలయానికి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గుడి మధుసూదన్ రెడ్డి సోమవారం రూ.60 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆయన విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిలుకానగర్‌లోని మర్ల మైసమ్మ ఆలయంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నిధులతో ఆలయంలో బేతం చెర్ల బండలు వేయిస్తామని తెలిపారు.. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న గుడి మధుసూదన్ రెడ్డి సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు కలిసి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రూ.45లక్షలతో ఇండోర్ స్టేడియం మరమ్మతు పనులు

ఉప్పల్ ఇండోర్ స్టేడియం మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, జూన్ 29 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్, బీరప్పగడ్డ డివిజన్‌లో రూ.99 లక్షల చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.25లక్షలతో ధర్మపురికాలనీలో సిసి రోడ్డుతోపాటు, రూ.45లక్షలతో ఇండోర్ స్టేడియం మరమ్మతులు, రూ.29లక్షలతో బొడ్రాయి వద్ద సిసి రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లో దశలవారిగా పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్, కొక్కొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, నరసింహ, బాలకృష్ణ గౌడ్, జల్లి మోహన్, మాస శేఖర్, ఫారూఖ్, రవీందర్ గౌడ్, నిదానకవి శ్రీకాంత్, ఓంకార్ సింగ్, పాపి రెడ్డి, ఒబేద్, శివ, నరేష్, రోహిత్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.